ప్రకృతి పరవశానికి ప్రతీక ఉగాది



జమాతే ఇస్లామి హింద్ ముద్రించిన గ్రీటింగ్ కార్డు

మండపేట/కపిలేశ్వరపురం: ఉగాది అనగానే పచ్చని పొలాలు, విరగ పూసిన వేప చెట్టు, ఏపుగా పెరిగిన చెరకు గెడలు ఇలా ప్రకృతిపరమైన అనేక దృశ్యాలు కళ్ల ముందు ఆవిష్కృతమవుతుంటాయి. శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలకడానికి జనం సన్నద్ధం అవుతున్నారు. ఆరోగ్యం, ఆహారం, ఆధ్యాత్మిక సమ్మేళనంతో ప్రజలు ఉగాది పండగను బుధవారం జరుపుకోనున్నారు.

షడ్రుచుల సమ్మేళనం

ఉగాది అనగానే గుర్తుకొచ్చేది ఆరోజు తయారు చేసే పచ్చడి. తీపి, కారం, ఉప్పు, వగరు, చేదు, పులుపు అనే ఆరు రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడిని తయారు చేయడం తెలుగువారి సంప్రదాయం. వేప పువ్వు, చెరకు, కొత్త బెల్లం, చింతపండు, మామిడికాయలు, అరటి పండు, ఉప్పు, కారం వగైరాలతో తయారు చేసే పచ్చడిని సేవించడం ప్రతి ఇంటా సాధారణంగా జరిగేదే. జీవితం అన్ని రుచుల సమ్మేళనం అని ప్రతీకాత్మకంగా చెప్పడానికే సంవత్సరం ప్రారంభం రోజున ఈ పచ్చడిని సేవించడం అనే సంప్రదాయం వచ్చిందని పెద్దలు చెబుతారు.

పంచాంగ పఠనమిలా..

ద్రాక్షారామలోని శ్రీమాణిక్యాంబ సమేత శ్రీభీమేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరపురంలోని శ్రీఅగస్త్యేశ్వర, పాపవినాసేశ్వరస్వామి, అంగరలోని శ్రీవేణుగోపాలస్వామి, రాయవరం మండలం వెదురుపాక శ్రీవిజయదుర్గాపీఠం తదితర ఆలయాల్లో పండితులు పంచాంగ పఠనం చేస్తారు.

జమాతే ఇస్లామి శుభాకాంక్షలు

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ పట్టణానికి చెందిన జమాతే ఇస్లామి హింద్ పట్టణశాఖ హిందువులకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపింది. అందు కోసం ప్రత్యేకంగా గ్రీటింగ్ కార్డులను ముద్రించి సంఘ నాయకులు మండపేటలో అందరికి అందజేస్తూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



రామచంద్రపురంలో విద్యార్థినితో రాగిజావ తాగిస్తున్న మంత్రి వేణు



కపిలేశ్వరపురంలో విద్యార్థినికి రాగిజావ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

విద్యతో పాటుగా ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: పేదరికాన్ని జయించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధనతో పాటుగా పిల్లల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని పిల్లావారి వీధిలోని మున్సిపల్ స్కూల్‌లో మంగళవారం మంత్రి వేణు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి రూ. 57వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య భారం కాకుండా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యాకానుక లాంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. జగనన్న గోరుముద్దతో పాటుగా వారానికి మూడు సార్లు రాగి జావ అందించే విధంగా బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రాగిజావతో పిల్లల్లో ఐరన్ సమస్యను అధిగమించవచ్చునని మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని మంత్రి వేణు తెలిపారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్‌లు పాలపర్తి శ్వేతపావని, మేడిశెట్టి వెంకట లక్ష్మి, వాడ్రేవుసాయిప్రసాద్, అంకం శ్రీనివాస రావు, ఎంపీడీఓ కీర్తిస్పందన, ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నాయకులు టేకుమూడి సత్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీనివాస్, కంచుమర్తి బాబూరావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం: ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి విద్యార్థులుండే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు పాటుపడటం ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగిజావను అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, సర్పంచ్ సాకా శ్రీనివాస్ పాల్గొన్న కార్యక్రమంలో వారి చేతుల మీదుగా విద్యార్థులకు రాగిజావను అందజేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పోషక విలువలు కలిగి తేలికగా జీర్ణమయ్యే ఆహారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. దాని ద్వారా విద్యార్థుల్లో సత్తువ కలిగి చదువుకునేందుకు మానసికంగానూ, శారీరకంగానూ సిద్ధపడేందుకు దోహదపడుతుందన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, ఎంపీడీఓ ఎం.రామకృష్టారెడ్డి పాల్గొన్నారు. 19 గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా రాగిజావ పంపిణీ ప్రారంభమైంది.

గొల్లపాలెంలో..

కాజులూరు: గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఎంఈఓ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రాగిజావ పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసి సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు పాల్గొని విద్యార్థులకు రాగిజావ అందజేశారు. సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, హెచ్‌ఎం వెంకటలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ మాత నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి పద్మజా, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి పాల్గొన్నారు.

రాయవరం మండలంలో..

రాయవరం: మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ ప్రారంభ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సర్పంచ్ ఆరిఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, ఎంపీడీవో డి.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, తహసీల్దారు ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని రాగిజావను విద్యార్థులకు అందించారు. సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ వరలక్ష్మి, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగరాజు పాల్గొన్నారు.

మండపేట మండలంలో..

మండపేట మండలంలోని ద్వారపూడి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ రాగిజావ పంపిణీని ప్రారంభించారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు



కె.గంగవరంలో యంత్రాల పంపిణీ ప్రారంభిస్తున్న మంత్రి వేణు తదితరులు

కె.గంగవరం: రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని మసకపల్లి గ్రామానికి చెందిన సబ్సిడీ పవర్‌టిల్లర్స్‌ను కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి రైతులకు ఆయన అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు రైతులను మోసం చేసి పాలన సాగించాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించి పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేసిందని దీనిలో భాగంగానే రైతు భరోసా ద్వారా రైతులను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందిస్తోందన్నారు. తాజాగా మందులు పిచికారీ చేయడానికి డ్రోన్లను కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటి చైర్మన్ పండు గోవిందరాజు, మసకపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి కళ్యాణ్, కాదా గోవిందు, ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఓబులనేని శ్రీవరలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటి చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ, సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, మండల కన్వీనర్ తోకల శ్రీనివాస పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట చొరవతో మహిళా సంఘాలకు లబ్ధి

నిలిచిపోయిన వైఎస్సార్ ఆసరా సొమ్ము తిరిగి మంజూరు



కపిలేశ్వరపురంలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం మహిళా సంఘాలకు ఈ నెల 25న రుణమాఫీకి సంబంధించిన ఆర్థిక లబ్ధిని అందజేయనుంది. మండలంలోని 1,517 మహిళా సంఘాలకు గానూ 11.74 కోట్ల రుణమాఫీ ఆర్థిక సాయం సంఘాల ఖాతాలకు జమ చేయనుంది. జిల్లాలో 130 గ్రూపులకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆర్థిక సాయం మంజూరుకాలేదు. వాటిలో కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 సంఘాలకు సైతం రుణమాఫీ సొమ్ము మంజూరుకాలేదు. దీంతో మండలంలోని ఆయా సంఘాలకు చెందిన 180 మంది మహిళా సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో పర్యటనలో మహిళలు ఎమ్మెల్సీ తోటకు ఈ విషయం చెప్పారు. ఈ సమస్యపై డీఆర్‌డీఏ పీడీ ద్వారా సెర్ప్ సీఈఓకు నివేదిక చేరింది. కాగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ చూపి ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా సంఘాలకున్న ఆర్థిక క్రమశిక్షణ, సంఘాలను సమర్థవంతంగా నడుపుకుంటున్న తీరును వివరించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి అందరితోపాటు రుణమాఫీ సొమ్మును జమ చేయాలని కోరారు. ఆయన కృషి ఫలించడంతో సమస్య పరిష్కారమైంది. మండలంలోని 18 సంఘాలకు రూ.54.82 లక్షలు మంజూరైంది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో మంజూరు విషయాన్ని ఎమ్మెల్సీ తోట ప్రకటించారు. ఆయనకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంఘాలకు ఆర్థిక చేయూతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వెన్నంటి నిలిచిన ఎమ్మెల్సీ తోటలను మహిళలు ప్రశంసించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మహిళాభ్యుదయం ద్వారా సమాజ ప్రగతి సాధ్యపడుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఏపీఎం అర్జున, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కోటమ్మ తల్లి తీర్థం

కె.గంగవరం: మండల పరిధిలోని పాత కోట గ్రామంలో కొలువైయున్న శ్రీ కోటమ్మ తల్లి తీర్థ మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ తీర్థ మహోత్సవానికి కోట గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన కోటిపల్లి, కె.గంగవరం, కొత్తకోట, ఊడిమూడి తదితర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి పసుపు, కుంకుమ. గాజులు, చీరలు, ముడుపులు అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. తీర్థ మహోత్సవం సందర్భంగా ఆలయంతో పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

నేటి నుంచి పీఠంలో వసంత నవరాత్రులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో చైత్ర శుద్ధ పాడ్యమి (ఉగాది) నుంచి దశమి వరకు (ఈ నెల 30 వరకు) వసంత నవ రాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వసంత నవరాత్రులు పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారికి కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన, చతుర్వేద స్వస్తి నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించడంతో పాటు శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఫలితాలపై పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు.



















